RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:62 | ఫిబ్రవరి 11, 2026 | వెల: రూ.3-00

### సిద్దిపేట జిల్లాలో ఓటర్లను
## ప్రలోభపెట్టే ప్రయత్నం భగ్నం

బీఆర్ఎస్ అభ్యర్థి కోసం నిల్వ చేసిన మద్యం, నిత్యావసర సరుకులు సీజ్



2లో

### రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు
## చెల్లించకపోవడం దుర్మార్గం



- ప్రభుత్వ నిర్లక్ష్యంతో వారికి తీవ్ర మానసిక వేదన
- తక్షణ చెల్లింపులు లేకపోతే ఉద్యమిస్తాం
- రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌పై సీఎం రేవంత్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ

2లో

### స్థిరమైన నాయకత్వం..
## బలమైన ముందడుగు



- సంక్షేమ పాలనపై ప్రజల విశ్వాసమే విజయానికి బలం
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం
- సీఎం రేవంత్ రెడ్డి

2లో

### 'కృష్ణా జలాల దోపిడీ'పై
## ప్రభుత్వం ఫెయిల్



- ఏపీ 80 శాతం జలాలు వినియోగిస్తోంది
- కేఆర్ఎంబీ లేఖలపై స్పందన కరవు
- తెలంగాణ అవసరాలపై తీవ్ర నిర్లక్ష్యం
- రేవంత్ సర్కార్ పై హరీష్ రావు ఫైర్

2లో



### మున్సిపల్ ఎన్నికలకు
## ఏర్పాట్లు పూర్తి

- శాంతియుతంగా జరిగేలా భద్రతా చర్యలు
- పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు,
- డీజీపీ శివధర్ రెడ్డి

2లో

# ఫైనల్ ఫైట్!



## నేడే మున్సిపల్ ఎన్నికల పోలింగ్

- ఉదయం 7గంటల నుంచి సాయంత్ర 5గంటల వరకు..
- 123 పట్టణాల్లో బ్యాలెట్ యుద్ధం
- బరిలో 12,930 మంది అభ్యర్థులు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 52.43 లక్షల మంది ఓటర్లు
- పోలింగ్ కేంద్రాల వద్ద హై అలర్ట్
- వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- సమస్యాత్మక ప్రాంతాల వద్ద ప్రత్యేక ఫోర్స్
- మేయర్, చైర్మన్ కుర్చీ కోసం అప్పుడే మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు
- 13న తేలనున్న భవితవ్యం.. 16న ప్రమాణ స్వీకారం

**అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా పుర ఎన్నికలు**




వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో

తెలంగాణలో పుర సమరం నేడు క్లైమాక్స్‌కు చేరుకుంది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో ఓటు యుద్ధానికి నగారా మోగింది. గత పది రోజులుగా సాగిన మాటల తూటాలు, హోరెత్తిన ప్రచార పర్వానికి తెర పడటంతో.. ఇప్పుడు బంతి ఓటరు కోర్టులోకి చేరింది. రాష్ట్ర వ్యాప్తంగా నేడు జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేయనున్నారు. అధికార కాంగ్రెస్ తన అభివృద్ధికి గీటురాయిగా.., ప్రతిపక్ష బీఆర్ఎస్ పట్టు నిరూపించుకునేందుకు.., బీజేపీ తన ఉనికికి కాపాడుకునేందుకు ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. భారీ పోలీసుల పహారా, వేల మంది సిబ్బంది ఎన్నికలకు అన్నివిధాల సన్నద్ధం అయ్యారు. నేటి ఓటు తీర్పుతో ఎవరు పట్టణ రాజులుగా నిలుస్తారో.. ఎవరికి పదవీ గండం పొంచి ఉందో తెలియాలంటే 13 వరకు వేచి చూడాల్సిందే!





2లో



### మధిర భవిష్యత్తే
## మా లక్ష్యం

- 'ఆదర్శ పట్టణం'గా తీర్చిదిద్దుతాం
- రాజకీయాల కోసం కాదు.. రాబోయే 50 ఏళ్ల అవసరాల కోసం ఎన్నికలు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2లో



## ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది

**బాధ్యులపై ఉక్కుపాదం తప్పదు!**

- ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారో ఆరా తీస్తున్నాం
- పుర పోరులో కాంగ్రెస్ ప్రభంజనం..
- 80 శాతం పైగా స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం
- మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

2లో

### హైదరాబాద్‌లో
## స్వల్ప భూ ప్రకంపనలు

- గాజులరామారం, మెట్‌ఖాన్‌గూడాలో కంపించిన భూమి
- భయంతో ఇళ్ల నుంచి జనం పరుగులు



2లో

వేద న్యూస్

బుధవారం | ఫిబ్రవరి 11, 2026

## స్థిరమైన నాయకత్వం..
# బలమైన ముందడుగు

- సంక్షేమ పాలనపై ప్రజల విశ్వాసమే విజయానికి బలం
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

స్థిరమైన పాలన, స్పష్టమైన దిశతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని సంపాదించిందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకున్న అభివృద్ధి పాలనకు ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని, అదే ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో స్పష్టమైన ఊపును అందిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, పట్టణాభివృద్ధి చర్యలు ప్రజల నిత్య జీవితాల్లో ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడిందని, అది ఎన్నికల ఫలితాల్లోనూ ప్రతిఫలించనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో విజయానికి సమన్వయంతో కూడిన నాయకత్వం, బూత్ స్థాయి క్రమశిక్షణ, క్షేత్రస్థాయిలో ఐక్యత అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీ శ్రేణులంతా ఒకే లక్ష్యంతో, స్పష్టతతో పనిచేస్తే ఫలితం అనుకూలంగా ఉంటుందని సూచించారు. ప్రజలే కేంద్రంగా, అభివృద్ధేలక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతుందని, పట్టణ ప్రాంతాల ప్రగతికి ఈ ఎన్నికలు కీలక మలుపు అవుతాయని సీఎం అభిప్రాయపడ్డారు. సంక్షేమం, ప్రజాపాలన, పారదర్శకతే కాంగ్రెస్ పాలనకు పునాది అని మరోసారి స్పష్టం చేశారు.

## మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

**పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు**
**డీజీపీ శివధర్ రెడ్డి**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర పోలీసు శాఖ డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా జరగేలా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అదనంగా 3 వేల మంది పోలీసు సిబ్బందిని రంగంలోకి దించామని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు, గస్తీ చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, ఎలాంటి భయం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు తావివ్వకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## హైదరాబాద్‌లో స్వల్ప భూ ప్రకంపనలు

**గాజులరామారం, మెట్‌ఖాన్‌గూడాలో కంపించిన భూమి**
**భయంతో ఇళ్ల నుంచి బయటికి పరుగులు**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్‌లో స్వల్ప భూ ప్రకంపనలు చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఉదయం సుమారు 10:10 గంటల సమయంలో గాజులరామారం పరిధిలోని మెట్‌ఖాన్‌గూడా ప్రాంతంలో భూమి కంపించినట్లు శబ్దం వినిపించిందని చెప్పారు. ఈ ఘటనతో పలు గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌లలో నివసిస్తున్న ప్రజలు భయంతో ఒక్కసారిగా బయటికి పరుగులు తీశారు. కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొనగా, పిల్లలు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భూమి కంపించిన శబ్దం భూకంపం కారణంగానా లేక ఇతర పేలుడు పదార్థాల వల్లనో అన్న విషయంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. ఈ ఘటనపై సంబంధిత అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. భూ ప్రకంపనలపై స్పష్టత రావాల్సి ఉందని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అధికారులు సూచించారు.

## సిద్దిపేట జిల్లాలో ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నం భగ్నం

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఎఫ్ఎస్ టీమ్ దాడులు
- బీఆర్ఎస్ అభ్యర్థి కోసం నిల్వ చేసిన మద్యం, నిత్యావసర సరుకులు సీజ్

**వేద న్యూస్, సిద్దిపేట**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం, నిత్యావసర సరుకులను అధికారులు పట్టుకున్నారు. గ జ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని రెండో వార్డులో పక్కా సమాచారం మేరకు ఎఫ్ఎస్ టీమ్ ఆకస్మిక దాడులు నిర్వహించింది. అధికారుల తనిఖీల్లో, బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున ఓటర్లకు పంపిణీ చేసేందుకు మద్యం బాటిళ్లు, నిత్యావసర సరుకులను ముందుగానే నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఈ సరుకులు సిద్ధం చేసినట్లు అధికారులు నిర్ధారించారు. దాడుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం, నిత్యావసర సరుకులను సీజ్ చేసి, సంబంధిత వివరాలను ఎన్నికల అధికారులకు నివేదించారు. ఈ ఘటనపై మరింత విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలనే ఉద్దేశంతో ఇలాంటి దాడులు కొనసాగుతాయని, ఎవరైనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల అధికారులు హెచ్చరించారు.

# ఫైనల్ ఫైట్!

## నేడే మున్సిపల్ ఎన్నికల పోలింగ్

- ఉదయం 7గంటల నుంచి సాయంత్ర 5గంటల వరకు..
- 123 పట్టణాల్లో బ్యాలెట్ యుద్ధం
- బరిలో 12,930 మంది అభ్యర్థులు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 52.43 లక్షల మంది ఓటర్లు
- పోలింగ్ కేంద్రాల వద్ద హై అలర్ట్
- వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- సమస్యాత్మక ప్రాంతాల వద్ద ప్రత్యేక ఫోర్స్
- మేయర్, చైర్మన్ కుర్చీ కోసం అప్పడే మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు
- 13న తేలనున్న భవితవ్యం.. 16న ప్రమాణ స్వీకారం
- అన్ని పార్టీలకు ప్రతిష్టాత్మకంగా పుర ఎన్నికలు



**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ గడ్డపై మరో రాజకీయ కురుక్షేత్రానికి తెర లేచింది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో నేడు పోలింగ్ జరగనుంది. గత పది రోజులుగా సాగిన మైకుల మోత, మాటల యుద్ధం, రోడ్ షోల పర్వం ముగియడంతో.. ఇప్పుడు అసలు సిసలైన ఓటు తీర్పు వంతు వచ్చింది. ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ తన అభివృద్ధికి గీటురాయిగా భావిస్తుంటే, ప్రతిపక్ష బీఆర్ఎస్ తన పట్టు నిలుపుకోవాలని, బీజేపీ తన ఉనికిని చాటుకోవాలని సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఈ దఫా ఎన్నికల్లో పోటీ మునుపెన్నడూ లేనంత తీవ్రంగా ఉంది. బరిలో 12,930 మంది అభ్యర్థులు నిలిచారు. కాగా, 123 పట్టణ స్థానిక సంస్థల్లో కలిపి మొత్తం 2,996 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 52.43 లక్షల మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషుల 25.62 లక్షలు కాగా, మహిళా ఓటర్లు 26.80 లక్షలుగా ఉండి పురుషులకంటే ఎక్కవగా ఉన్నారు.

**పోలింగ్ కేంద్రాల వద్ద హై అలర్ట్**

ఎన్నికల కమిషన్ భద్రత విషయంలో రాజీ పడలేదు. రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మందికి పైగా పోలీస్ సిబ్బందిని మోహరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో స్పెషల్ ఫోర్స్ రంగంలోకి దిగింది. ఇప్పటికే పోలింగ్ సామగ్రితో 40 వేల మందికి పైగా ఎన్నికల సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. రిమోట్ ప్రాంతాలకు ప్రత్యేక వాహనాల్లో బ్యాలెట్ బాక్సులను తరలించారు.

**ఓటర్లకు ప్రత్యేక వసతులు**

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగుల కోసం వీల్ చైర్లు, ర్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు ఎండ తీవ్రత దృష్ట్యా ప్రతి కేంద్రం వద్ద తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు.

**తెర వెనుక నోట్ల రాజకీయం**

బహిరంగ ప్రచారానికి తెరపడిన తర్వాత, అసలైన 'నైట్ పాలిటిక్స్' మొదలయ్యాయి. ఈసారి అభ్యర్థులు భారీగా ఖర్చు చేశారు. కొన్ని చోట్ల ఒక్కో ఓటుకు రూ. 2 వేల నుంచి రూ. 5 వేల వరకు ధర పలికినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిష్టాత్మక మున్సిపాలిటీల్లో అభ్యర్థులు కోట్లు కుమ్మరించినట్లు సమాచారం.

**13న కౌంటింగ్.. 16న ప్రమాణస్వీకారం**

నేడు జరగనున్న పోలింగ్ ప్రక్రియ అంతా బ్యాలెట్ పేపర్ల ద్వారానే సాగుతుంది. ఫిబ్రవరి 13న ఉదయం నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అదే రోజు సాయంత్రానికి రాష్ట్రంలోని పట్టణాల్లో ఎవరు రాజు? ఎవరు మంత్రి? అనేది స్పష్టమవుతుంది. గెలిచిన అభ్యర్థులు ఫిబ్రవరి 16న పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం మేయర్లు, చైర్మన్ల ఎంపిక ప్రక్రియ కూడా ముగియనుంది.

### అప్పడే విచిత్ర పొత్తులు..

కొన్ని వార్డుల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఒకరినొకరు ఓడించుకోవడానికి లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఫలితాల తర్వాత మేయర్ పీఠం కోసం అప్పడే 'మ్యాచ్ ఫిక్సింగ్' బేరసారాలు మొదలయ్యాయి. కాగా, ఏడు కార్పొరేషన్లయిన కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, కొత్తగూడెం, నల్గొండ వంటి కీలక నగరపాలక సంస్థల్లో మేయర్ పీఠం కోసం హోరాహోరీ పోరు సాగుతోంది. ఈ ఎన్నికలు కేవలం అభ్యర్థులకే కాదు, ఆయా జిల్లాల ఇంచార్జ్ మంత్రులకు కూడా తలనొప్పిగా మారాయి.

# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోంది



- బాధ్యులపై ఉక్కుపాదం తప్పదు!
- ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారో ఆరా తీస్తున్నాం
- పుర పోరులో కాంగ్రెస్ ప్రభంజనం..
- 80 శాతం పైగా స్థానాలు కైవసం చేసుకోవడం ఖాయం
- మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి**

రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలోనే కాకుండా ప్రస్తుతం కూడా రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతోందని, దీనిపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా ఉందని వెల్లడించారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ట్యాపింగ్ కోసం ఎక్కడెక్కడ ఎక్విప్‌మెంట్ (పరికరాలు) అమర్చారో ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీస్తోందని, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రజాస్వామ్య స్వేచ్ఛకు భంగం కలిగిస్తే వదిలిపెట్టం**

ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, జరుగుతోందని అనేక మంది గగ్గోలు పెడుతున్నారు.. ఇది అక్షరాలా నిజం. ఇప్పుడు కూడా కొందరు ఈ అక్రమాలకు పాల్పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఎంక్వయిరీ చేస్తోంది. ఎవరు సూత్రధారులు? ఎక్కడెక్కడ పరికరాలు పెట్టారు? అనేది బయటకు తీస్తాం. చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగులను ఓట్లు అడగడంలో తప్పేముందని, తన పార్టీ తరఫున తాను అడిగానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

**80 శాతం పైగా సీట్లు కాంగ్రెస్‌వే..**

బుధవారం జరగనున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. గడిచిన రెండేళ్లలో మేం చెప్పిన ప్రతి మాటను నిలబెట్టుకుని ప్రజలకు చేరువయ్యాం. అందుకే ఈ పుర ఎన్నికల్లో 80 శాతానికి పైగా స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోబోతోంది. ఇది జీర్ణించుకోలేకే ప్రతిపక్ష నాయకులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ విసిరిన సవాళ్లను ప్రజలు తిప్పికొట్టారు.. అదే ఫలితం రేపు పునరావృతం కాబోతుందని అన్నారు.

**అభివృద్ధికి పెద్ద పీట..**

గత ప్రభుత్వ తీరుపై పొంగులేటి తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ధనిక తెలంగాణను రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు. నెలకు రూ. 6,300 కోట్లు కేవలం అప్పులకే కడుతూ కూడా సంక్షేమాన్ని ఆపలేదు. గత దొరల పాలనలో పేదలను విస్మరించారు. 62 వేల డబుల్ బెడ్ రూంలను మొండిగోడలుగా మిగిల్చారు. కానీ మేం 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం.

'వరి వేస్తే ఉరి' అన్న కాలం పోయి, ఇప్పుడు వడ్లకు బోనస్ ఇస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. మాజీ మంత్రుల అసభ్య పదజాలానికి ప్రజలు ఓటు ద్వారానే తగిన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు

# కృష్ణా జలాల దోపిడీపై ప్రభుత్వం ఫెయిల్

## రేవంత్ సర్కార్ పై హరీష్ రావు ఫైర్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

కృష్ణా నదీ జలాలను ఆంధ్రప్రదేశ్ ఇష్టారాజ్యంగా వినియోగిస్తుంటే, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని చోద్యం చూస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇండెంట్లు లేకుండా, బోర్డు అనుమతులు లేకుండానే ఏపీ కృష్ణా నీటిని వినియోగిస్తోందని హరీష్ రావు ఆరోపించారు. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కృష్ణ రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ కు రాసిన లేఖను ప్రస్తావిస్తూ, తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం ఏపీ తన వాటాను ఇప్పటికే దాటిందని తెలిపారు. జనవరి 29 నాటికి ఏపీ 664 టీఎంసీలు, అంటే సుమారు 80 శాతం నీటిని వినియోగించిందని చెప్పారు. జనవరి 28న బోర్డుకు లేఖ రాసి తక్షణమే సమావేశం ఏర్పాటు చేసి ఏపీ నీటి దోపిడీని ఆపాలని కోరిన ఈఎన్‌సీ, మూడు రోజుల్లోనే రిటైర్ అయ్యారని హరీష్ రావు గుర్తుచేశారు. ఆయన రిటైర్మెంట్ అనంతరం వారం రోజులపాటు కీలక పోస్టును ఖాళీగా ఉంచడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. బోర్డు సభ్యుడే లేని పరిస్థితిలో రాష్ట్ర ప్రయోజనాలు ఎలా కాపాడతారని నిలదీశారు. ఈ వాటర్ ఇయర్‌లో తెలంగాణకు తాత్కాలికంగా 34 శాతం నీటి వినియోగ హక్కు ఉన్నప్పటికీ, ఇప్పటివరకు కేవలం 20 శాతం మాత్రమే వినియోగించుకున్నామని చెప్పారు. రోజుకు ఇంకా ఏపీ 1.5 టీఎంసీల నీటిని తరలించుకుపోతుంటే, ప్రభుత్వం చేతులు కాలినాక ఆకులు పట్టుకున్నట్లు లేఖలు రాయడం తప్ప గట్టి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తరలిపోతున్నా ప్రభుత్వం కళ్లుమూసుకుందని మండిపడ్డారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటలు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు అత్యంత అవసరమని హరీష్ రావు గుర్తుచేశారు. తెలంగాణ అవసరాలను పక్కనపెట్టి రేవంత్ రెడ్డి చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే కాంగ్రెస్ హయాంలో కృష్ణా జలాల వినియోగం అత్యల్ప స్థాయికి పడిపోయిందని, ఇది ముఖ్యమంత్రి వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# మధిర భవిష్యత్తే మా లక్ష్యం: భట్టి విక్రమార్క

**వేద న్యూస్, మధిర**

మధిర మున్సిపాలిటీ ఎన్నికలు కేవలం రాజకీయాల కోసమే కాదని, మధిర భవిష్యత్తును నిర్ణయించే కీలక సందర్భమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రాబోయే 50 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో మధిరను ఒక ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మధిర మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో భట్టి విక్రమార్క ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో ఓటు హక్కును ఆలోచించి వినియోగించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, మార్పు కోరుకునే ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి మధిర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయాలని కోరారు. మన మధిర మన బాధ్యత అని, పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో తీసుకునే నిర్ణయమే మధిరను ముందుకు నడిపిస్తుందని, ప్రజలు మార్పుకు సహకరించాలన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించకపోవడం దుర్మార్గం

**రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌పై సీఎం రేవంత్‌కు బండి సంజయ్ బహిరంగ లేఖ**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్‌ను చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. పదవీ విరమణ చేసి రెండేళ్లు గడిచినా రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ బకాయిలు చెల్లించకపోవడం దుర్మార్గమైన చర్యగా లేఖలో పేర్కొన్నారు. రిటైర్డ్ అయిన అనంతరం ప్రశాంతంగా జీవించాల్సిన ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటివరకు 61 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది క్షమించరాని నేరమని, మానవత్వం లేని పాలనకు నిదర్శనమని అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వెంటనే అన్ని బెనిఫిట్స్ చెల్లించి, సగౌరవంగా పంపించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. జీవితాంతం ప్రభుత్వ సేవలో పనిచేసిన ఉద్యోగులను చివరి దశలో ఇలాంటి పరిస్థితులకు నెట్టడం ఘోరమైన అన్యాయమని పేర్కొన్నారు. తక్షణమే రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలన్నీ చెల్లించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ నడిబొడ్డున దీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేస్తూ, రిటైర్డ్ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ప్రకటించారు.

# సహ రక్షణ చట్టం సొసైటీ డైరీ ఆవిష్కరణ



**వేద న్యూస్, హైదరాబాద్ :**

పాలనలో పారదర్శకత కోసమే 2005లో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారని సమాచార కమిషనర్ పీవీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆర్టీఐ భవన్ హైదరాబాదులో సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ డైరీ సహ చట్టం రాష్ట్ర ఆర్గనైజర్ చట్టబోయిన విద్యాసాగర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ అమీర్ ఖాన్ ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలి పారు. ఆర్టీఐ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తే అవినీతి తగ్గిపోతుందని, ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ శాఖలు పారదర్శకత, జవాబుదారీతనం తో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కలిగి ఉండాలని అందుకుగాను అనుబంధ సహ చట్టం సొసైటీ సభ్యులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో కృషి చేయాలని కోరారు. అలాగే సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ సభ్యులు రాష్ట్రంలో సహ చట్టంపై చేస్తున్న కార్యక్రమాలను అభినందిస్తూ సొసైటీ సభ్యులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా స్టూడెంట్ కన్వీనర్ రాహుల్, జిల్లా సభ్యులు హనుమకొండ జిల్లానిర్వాహక కార్య దర్శి షరీఫ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు జబీర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- **800 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



**వేద న్యూస్, సిరిసిల్ల:**

సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు 800 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సిరిసిల్ల, వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లలో ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు. పోలింగ్ పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల పరిధిలో 17 రూట్ మొబైల్స్, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో 6 జోనల్ టీమ్స్, 4 రిజర్వ్ టీమ్స్, 2 స్ట్రయికింగ్ ఫోర్స్‌లు, 2 స్పెషల్ స్ట్రయికింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేసి మొత్తం 800 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్రాలను వదిలి వెళ్లరాదని, రూట్ మొబైల్ అధికారులు తమకు కేటాయించిన మార్గాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలు లేదా రూట్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, మందుగుండు సామగ్రి, ఇంక్ బాటిళ్లు, వాటర్ బాటిళ్లు తీసుకువెళ్లడం నిషేధమని, పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడంపై పూర్తిగా నిషేధం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల్లో 163 బీఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వాటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే అందరి సహకారం అవసరమని ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచాలరి, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కారేపల్లి 'గేటు' కష్టాలు!

- ☐ రైలు వెళ్లినా కల్పించని ప్రవేశం
- ☐ గంటల కొద్దీ ప్రయాణికుల నిరీక్షణ
- ☐ ఓపిక పట్టలేక రైల్వే సిబ్బందితో వాగ్వాదం



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండల కేంద్రంలోని కారేపల్లి గ్రామంలో రైల్వే గేటు వద్ద మంగళవారం తీవ్ర అవస్థలు నెలకొన్నాయి. రైలు వెళ్లి పోయినా గేటు మాత్రం తెరుచుకోకపోవడంతో కారేపల్లి-ఇల్లెందు రహదారిపై ప్రయాణికుల సహనం కట్టలు తెంచుకుంది. రైల్వే అధికారుల నిర్లక్ష్యమో, సిబ్బంది మొద్దునిద్రో తెలియకపోయినా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాధారణంగా రైలు రాకకు కొద్ది నిమిషాల ముందు గేటు వేయడం, రైలు వెళ్లిన వెంటనే గేటు తీయడం ఆనవాయితీ. కానీ కారేపల్లి సమీపంలోని ఈ రైల్వే గేటు వద్ద పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. పట్టాలపై నుంచి రైలు వెళ్లి గంట దాటినా గేటు తీయకపోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి.

**ఎక్కడి వాహనాలు అక్కడే..**



అటు ఇల్లందు వైపు, ఇటు కారేపల్లి వైపు వెళ్లే వందలాది వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నిమిషాల్లో ముగియాల్సిన నిరీక్షణ గంటలుగా మారడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. తీవ్రమైన ఎండలో గంటల తరబడి వేచి చూడాల్సి రావడంతో మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు నరకప్రాయమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర పనులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడం అధికారుల వైఫల్యానికి నిదర్శనంగా మారింది.

**సిబ్బందితో వాగ్వాదం**

ఎంతకీ గేటు తీయకపోవడంతో విసిగిపోయిన వాహనదారులు గేటు వద్దకు చేరుకుని రైల్వే సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రైలు వెళ్లిన తర్వాత కూడా గంటల పాటు గేటు తీయకపోవడం వెనుక సాంకేతిక లోపమా? లేక బాధ్యతారాహిత్యమా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. 'మా ప్రాణాలకు, మా సమయానికి విలువ లేదా?' అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రైల్వే గేటు వద్ద ఇలాంటి పరిస్థితులు తరచూ పునరావృతమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఫ్లైఓవర్ నిర్మించాలని, లేదా కనీసం సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి ఇలాంటి 'గేటు కష్టాలు' మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# కాసుల బాలరాజును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

- నల్ల బ్యాడ్జీలతో కాంగ్రెస్ నేతల నిరసన



**వేద న్యూస్, రుద్రూరు:**

బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 5వ వార్డులో పోటీ చేస్తున్న రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రియల్ చైర్మన్ కాసుల బాలరాజు భార్యని ఘోరంగా ఓడించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. బాన్సు వాడలో కాసుల బాలరాజు రౌడీయి జానికి పరాకాష్టగా మారారని వారు ఆరోపించారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇందూరు చంద్రశేఖర్‌పై దాడి చేయడం అమానుషమని, ఇలాంటి వ్యక్తిని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సోమవారం రాత్రి ఇందూరు చంద్రశేఖర్‌పై జరిగిన దాడికి నిరసనగా రుద్రూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో ఇలాంటి వ్యక్తులను గెలిపిస్తే మరింత రౌడీయిజం పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. విందు కార్యక్రమం నుంచి తిరిగి వస్తున్న సమయంలో ఇందూరు చంద్రశేఖర్‌పై కక్షపూరితంగా దాడి చేయడం తీవ్రంగా ఖండనీయమని అన్నారు. అలాగే ఆయనతో ఉన్న ముస్లిం సోదరులపై దురుసు పదాలతో దూషించడం మరింత దారుణమని విమర్శించారు. ఈ ఘటనపై పార్టీ అధిష్టానం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ పట్టణం కాసుల బాలరాజుకు చెందిన సొత్తు కాదని, కాంగ్రెస్ నాయకులను బెదిరించే హక్కు ఎవరికీ లేదని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఎంపీ జన్మదిన వేడుకలు



**వేద న్యూస్, మందమర్రి:**

పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశి జన్మదిన వేడుకలను మంద మర్రిలో కాంగ్రెస్ పార్టీ నాయకు లు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మందమర్రి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (బీ-1) వద్ద పట్టణ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎంపీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పైడిమల్ల నర్సింగ్, ఇషాక్, రాజ్ కుమార్, వేముల శ్రీనివాస్, కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి నీరటి వెంకటేష్, పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, జావీద్, బొజ్జ గణేష్, మెరుగు సతీష్, సాయి కిరణ్, ధనుక్, రాజేష్, మధుకర్, ప్రదీప్, రహీం, మహేష్, రుత్విక్, పార్థు, కిరణ్, రాజు తదితరులు పాల్గొని ఎంపీకి శు భాకాంక్షలు తెలిపారు.

# ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

- రక్షణగా ప్రత్యేకమైన స్ట్రైకింగ్ ఫోర్సులు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- 163 బీఎన్ఎస్ఎస్ అమలు.. గుంపులు నిషేధం
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్:**

మెదక్ జిల్లా పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం మెదక్ పట్టణంలోని వెస్లీ కాలేజీ ప్రాంగణంలో మున్సిపల్ ఎన్నికల బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో క్రమశిక్షణగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభం నుంచే ప్రతి పోలీసు సిబ్బంది తమకు కేటాయించిన డ్యూటీ పోస్టులకు హాజరై, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి, అవసరమైన సహకారం అందించాలని సూచించారు. మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 74 వార్డులు, 148 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మొత్తం 686 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల భద్రతా చర్యల్లో భాగంగా 17 రూట్లలో ఎస్ఐ స్థాయి అధికారులతో రూట్ మొబైల్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సీఐల ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ టీమ్స్, నలుగురు డీఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల చుట్టుపక్కల 100 మీటర్ల పరిధిలో గుంపులు గుమికూడడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చర్యలు గమనించిన వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు బలగాలు, స్ట్రైకింగ్ ఫోర్సులు, వీడియో రికార్డింగ్ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో ప్రచార సామగ్రి, పార్టీ చిహ్నాలు, మొబైల్ ఫోన్లు తీసుకురావడం నిషేధమని తెలిపారు. పోలింగ్ బూత్‌లో సెల్ఫీలు దిగడంపై పూర్తిస్థాయి నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో మద్యం, డబ్బుల పంపిణీ, ఓటర్లపై ఒత్తిడి, తప్పుడు ప్రచారాలకు పాల్పడితే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికలు జరుగుతున్న మున్సిపాలిటీల పరిధిలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉంటుందని, దీని ప్రకారం నలుగురికి మించి గుంపులుగా గుమికూడరాదని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద చర్యలు గమనించినట్లయితే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# 'మిడ్ మానేర్' బాధితులకు న్యాయం చేయాలి

- 2005లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదు
- పట్టా ప్యాకేజీల్లో అక్రమాలపై గ్రామ ప్రజల ఆగ్రహం

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామం 2005లో మిడ్ మానేర్ ప్రాజెక్టు ముంపుకు గురైంది. అప్పట్లో 18 సంవత్సరాలు నిండిన యువతకు రూ. 2,04,000 నష్టపరిహారం, ఇల్లు నిర్మించుకు నేందుకు రెండు గుంటల ప్లాట్ ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ అనేక మంది ముంపు బాధితులకు పట్టా ప్యాకేజీలు అందలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిడ్ మానేర్ పరిధిలోని 12 గ్రామాలు ముంపుకు గురై 18 సంవత్సరాలు గడిచినా న్యాయం జరగలేదని, అధికారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా, గ్రామానికి సంబంధం లేని ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి పట్టా ప్యాకేజీలు అందాయని ఆరోపిస్తున్నారు. బయటి ప్రాంతాల వారికి అక్రమంగా పట్టాలు ఇచ్చారనే అనుమానాలతో పాటు, ఇందుకు లంచాల లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సంబంధం లేని వారికి ఇచ్చిన పట్టా ప్యాకేజీలను వెంటనే రద్దు చేసి, నిజమైన ముంపు బాధితులకు అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. తమ భూములు, ఇండ్లు కోల్పోయి కిరాయి ఇళ్లలో జీవిస్తూ ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాధితులు తెలిపారు. అప్పట్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని వాపోయారు. ముంపు గ్రామాల్లో పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పించాలని, అర్హులైన యువకులకు వెంటనే పట్టా ప్యాకేజీలు అందించాలని కోరారు. ఈ మేరకు మిడ్ మానేర్ ముంపు బాధిత యువకులు, గ్రామ ప్రజలు ప్రభుత్వానికి వినతి పత్రం అందజేశారు.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 11, 2026

# లేబర్ కోడ్ల రద్దుకు 12న దేశవ్యాప్త సమ్మె

**– జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపు**

**వేద న్యూస్, కారేపల్లి:**



కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 12న కార్మిక సంఘాలు ప్రకటించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు సంపూర్ణంగా పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని నాయకులు పిలుపు నిచ్చారు. ఈ మేరకు మంగళవారం కారేపల్లిలో ఓబీసీ కార్మికులు, హమాలి కార్మికుల వద్ద నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఖమ్మం జిల్లా నాయకుడు భూక్య శివ నాయక్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులు పోరాడి సాధించు కున్న హక్కులను కార్పొరేట్ల లాభాల కోసం కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్ల రూపంలో తీసుకురావడం కార్మిక వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం ఐక్యంగా పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఏఐ వాడకంలో అప్రమత్తంగా ఉండాలి

**– ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి**

**– ఎస్ఐ రమేష్**



**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశా లలో నిర్వహించిన అంత ర్జాతీయ సురక్షిత ఇంటర్నెట్ దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జె. రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. విద్యార్థులు రానున్న వార్షిక పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్లు, సోషల్ మీడి యాకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. అలాగే ఈ ఏడాది థీమ్ "స్మార్ట్ టెక్, సేఫ్ ఛాయిసెస్" నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సాంకేతికతను జ్ఞానార్థం ఉపయోగించాలే తప్ప, తప్పుదారి పట్టేలా వినియోగించరాదని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఎస్ఐ ఇచ్చిన సూచనలను విద్యార్థులు పాటించి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సీఐ వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 14 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో ఇద్దరు వ్యక్తులు అనుమతికి మించి మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో మంగళవారం వారిని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్. ఫాతిమా చిన్నప్ప ఎదుట హాజరుపరిచారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మొహమ్మద్ యాకుబ్ పాషా, బానోత్ జుమ్మిలాల్‌లకు రెండు రోజుల జైలు శిక్ష విధించగా, వారిని హుజురాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపారు.

# స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**– అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు**

**– ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్**

**– ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల**

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో జరిగే ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా, భయరహితంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. నేడు సిరిసిల్ల, వేములవాడలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిరిసిల్ల గీతానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నికల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామని, నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ అధికారులు బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను ముందుగా తనిఖీ చేసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించామని, అన్ని కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంటుందని, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు, వీల్‌చైర్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39 వార్డులు, 117 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వేములవాడ మున్సిపల్ పరిధిలో 28 వార్డులు, 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సిరిసిల్లలో మొత్తం ఓటర్లు 81,959 మంది (పురుషులు 39,942, మహిళలు 42,011, ఇతరులు 6), వేములవాడలో మొత్తం ఓటర్లు 40,877 మంది (పురుషులు 19,580, మహిళలు 21,279, ఇతరులు 18) ఉన్నారని తెలిపారు. ఎన్నికల విధుల కోసం సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో కలిపి 27 మంది రిటర్నింగ్ అధికారులు, 27 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 210 మంది ఏపీఓలు, 630 మంది ఓపీఓలను నియమించినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో పేరు ఉండి ఎపిక్ కార్డు (ఓటరు గుర్తింపు కార్డు) లేనివారు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్, బ్యాంక్ లేదా పోస్టాఫీస్ ఫొటో పాస్‌బుక్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్, ఉపాధి హామీ జాబ్ కార్డు, పెన్షన్ పత్రాలు, ఉద్యోగ గుర్తింపు కార్డులు, యూడీఐడీ కార్డు తదితర ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ నెల 13న సిరిసిల్ల, వేములవాడ సినారె కళామందిర్‌లో ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదు చేస్తే బెదిరింపులా?

**– ఆర్టీఐ కార్యకర్తలకు రక్షణ కరువు**

**– దరఖాస్తు చేసినందుకు జీపీఓ బెదిరింపులు**

**– జిల్లా కలెక్టర్, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు**

**వేద న్యూస్, సిద్దిపేట:**



ఆర్టీఐ దరఖాస్తు చేసినందుకు ఒక ఆర్టీఐ కార్యకర్తను బెదిరించిన ఘటన సిద్దిపేట జిల్లాలో వెలుగులోకి వచ్చింది. దుబ్బాక మండలం రాజక్కపేట గ్రామంలో జీపీఓగా విధులు నిర్వహిస్తున్న మద్దెల రవి, ఆర్టీఐ కార్యకర్త షాదుల్‌ను ఫోన్ ద్వారా బెదిరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. రాజక్కపేట గ్రామంలో విధులు నిర్వహిస్తున్న మద్దెల రవి తన ఉద్యోగానికి సంబంధించిన అర్హత పత్రాలు న్యాయపరంగా సరైనవి కావని, జూనియర్ అసిస్టెంట్ పదవికి అర్హుడు కాదని ఆరోపిస్తూ కౌన్సిల్ ఫర్ ఆర్‌టీఐ రాష్ట్ర అధ్యక్షుడు షాదుల్ గత సంవత్సరం నవంబర్ 24న సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలు కోరుతూ ఈ నెల 4న సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈనెల 6న మద్దెల రవి తనకు ఫోన్ చేసి 'నాపైనే ఆర్టీఐ వేస్తావా? నువ్వెవరివి? అధికారివా?' అంటూ దుర్భాషలాడుతూ బెదిరించారని షాదుల్ ఆరోపించారు. అంతేకాకుండా తప్పుడు ఆరోపణలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. ఈ బెదిరింపుల కారణంగా తనకు ప్రాణహాని ఉందని, సిద్దిపేట మొదటి పట్టణ పోలీస్ స్టేషన్‌తో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తనకు భద్రత కల్పించడంతో పాటు, సంబంధిత అధికారిపై పూర్తి స్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ ఆర్‌టీఐ రాష్ట్ర అధ్యక్షుడు షాదుల్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీఐ కార్యకర్తలకు రక్షణ కల్పించే జీవో ఉన్నప్పటికీ, అమలులో అధికారులు విఫలమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# కులం పేరుతో దూషిస్తోంది.. కొడుతోంది..

- ☐ మడికొండ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ప్రిన్సిపాల్ దాష్టీకం
- ☐ ఆందోళన చేపట్టిన విద్యార్థినులు
- ☐ 680 మందికి రెండు టాయిలెట్టే అని ఆరోపణ



**వేద న్యూస్, మడికొండ:**

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల–కళాశాలలో ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి వ్యవహారశైలికి వ్యతిరేకంగా విద్యార్థినులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ అరాచకాలను తట్టుకోలేక దాదాపు 120 మంది విద్యార్థినులు కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదు చేసేందుకు బయలుదేరగా, పోలీసులు అడ్డుకోవడంతో ఈనాడు కార్యాలయం సమీపంలో బైఠాయించారు. విద్యార్థినులు మాట్లాడుతూ.. క్లాస్‌కు ఆలస్యంగా వచ్చినందుకు 11 మంది విద్యార్థినులను విచక్షణా రహితంగా కొట్టారని ఆరోపించారు. ఇది కొత్త విషయం కాదని, చాలా రోజులుగా పాఠశాల, కళాశాలలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వాపోయారు. అంతేకాకుండా కులం పేరుతో దూషిస్తూ వివక్ష చూపుతున్నారని ఆరోపణలు చేశారు. కళాశాలలో మౌలిక వసతులు అత్యంత దయనీయంగా ఉన్నాయని, పాఠశాలకళాశాల కలిపి సుమారు 680 మంది విద్యార్థినులకు కేవలం రెండు లేదా మూడు టాయిలెట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. భోజన సదుపాయాలు కూడా సరిగా లేవని, కొన్నిసార్లు సరిపడా ఆహారం ఇవ్వకపోవడమే కాకుండా నాణ్యత లేని ఆహారం వడ్డించారని ఆరోపించారు. ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ సరిత, పీడీ పద్మ విద్యార్థినులను వేధించేవారని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విద్యార్థినులు తెలిపారు. కళాశాల ఆవరణలో కుక్కకాటుకు గురైన ఘటనలు కూడా జరిగాయని, ఈ విషయాలను బయటికి రాకుండా బెదిరించారని ఆరోపించారు. సిబ్బంది సంఖ్య ఉన్నప్పటికీ రోజూ కొద్దిమంది మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ధర్నా కొనసాగుతున్న సమయంలో స్థానిక సీఐ పుల్యాల కిషన్ ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి, విద్యార్థినుల సమస్యలపై ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడించారు. అనంతరం టీజీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఇన్‌చార్జి జేడీఓ అపర్ణ సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు ధర్నాను విరమించారు.

# సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు

**వేద న్యూస్, మడికొండ:**



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం, మడికొండ 64వ డివిజన్‌లో కేదారేశ్వర స్వామి ఆలయం–ముదిరాజ్ కాలనీకి వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా మారి ప్రమాదాలకు దారి తీస్తుండటంతో, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్ స్పందించారు. కాలనీవాసుల ఇబ్బం దులను గమనించిన ఆయన తన సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మత్తులు చేపట్టి సమస్యను తక్షణమే పరిష్కరిం చారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ దువ్వ శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ కాశీవిశ్వేశ్వర దేవాలయ ధర్మకర్తగా సిలివేరు రాజు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ తూర్పు కాశీబుగ్గలోని ప్రసిద్ధ శ్రీ కాశీవిశ్వేశర దేవాలయంలో రానున్న మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని ఐదుగురితో నూతన ఆలయ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఆలయ ధర్మకర్తగా సిలివేరు రాజును నియమించారు. ఈ సందర్భంగా సిలివేరు రాజుకు భక్తులు, స్థానికులు, స్నేహితులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనతో పాటు మహాశివరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని సిలివేరు రాజు తెలిపారు. తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మేడంకు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు గోపాల నవీన్ రాజ్ కు కృతజ్ఞతలు తెలిపారు. సిలివేరు రాజు నియామకంతో ఈ ఏడాది మహాశివరాత్రి కార్యక్రమాలు మరింత ఘనంగా, సమర్థవంతంగా నిర్వహించబడతాయని భక్తులు, సన్నిహితులు ఆశాభావం వ్యక్తం చేశారు.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 11, 2026

# సర్పంచులు-కార్యదర్శుల సమావేశం

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కార్యాలయంలో మంగళవారం ఉదయం సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్, 15వ ఫైనాన్స్ యాక్షన్ ప్లాన్ అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి జిల్లా పంచాయితీ అధికారి వై.డి. సరిఫోద్దిన్, ఇంజనీర్ (గ్రిడ్) వైడీ ముజాహిద్ అన్వర్, ఇంటర్మీడియట్ డీఈఓ ఉమారాణి, ఎండీవో బి. జయశీల, సీహెచ్ విశ్వన్ డీఈఓ, ఏఈఆర్‌డబ్ల్యూ అభిషేక్ రావు, ఎంపీఓ శ్రీధర్ హాజరై సర్పంచులు, కార్యదర్శులకు పలు సూచనలు, మార్గదర్శకాలు అందజేశారు.

# కోదురుపాక రింగ్‌రోడ్‌లో అక్రమ షాప్‌లు

**– అనుమతులు ఎవరివి.. ఆదాయం ఎక్కడికి పోతుంది?**

**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక రింగ్ రోడ్డులో కేడీసీసీ బ్యాంకు వరకు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన షాప్‌లపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ షాప్‌లకు ఎవరు అనుమతులు ఇచ్చారు? ఏ అధికారుల సంతకాలతో ఈ షాప్‌లు ఏర్పడ్డాయి? అనే విషయాలు ఇప్పటికీ స్పష్టంగా తెలియడం లేదని వారు అంటున్నారు. ఈ షాప్‌ల ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా వచ్చిన ఆదాయం ఎంత? ఆ ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించారా? లేక మధ్యలో మాయమైందా? అనే ప్రశ్నలు గ్రామంలో చర్చకు దారితీస్తున్నాయి. అలాగే ఈ షాప్‌లకు కరెంట్ కనెక్షన్లు ఎవరి అనుమతితో ఇచ్చారన్నదానిపై కూడా స్పష్టత లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. షాప్ పెట్టుకోవాలనుకున్న ప్రతి ఒక్కరికీ ఎందుకు అనుమతులు ఇవ్వలేదని, కొందరికే అవకాశం ఇచ్చి మిగతావారిని పక్కన పెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ షాప్‌ల ద్వారా వచ్చిన ఆదాయం గ్రామపంచాయతీ ఖాతాలో జమ అవుతుందా? లేక వ్యక్తిగత లాభాలకే ఉపయోగపడుతుందా? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# విద్యార్థులకు పరీక్షల ఒత్తిడిపై అవగాహన

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), మోడల్ స్కూల్ విద్యార్థులకు పరీక్షల ఒత్తిడి నిర్వహణ, మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం (డీఎంహెచ్‌పీ) మానసిక వైద్య నిపుణులు డాక్టర్ బి. ప్రవీణ్ కుమార్ పాల్గొని పరీక్షల సమయంలో ఎదురయ్యే ఒత్తిడి, భయం, ఆందోళనలను ఎలా అధిగమించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. సమయ నిర్వహణ, సానుకూల ఆలోచనలు, ధ్యానం, సరైన నిద్ర, ఆరోగ్యకర జీవనశైలి ప్రాధాన్యతను వివరించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'వేద న్యూస్' కథనానికి మున్సిపల్ అధికారుల స్పందన

**వేద న్యూస్, మడికొండ:**

కాజీపేట పట్టణం, మడికొండ ఖండాల దాబా-సుచి హోటల్ ఎదురుగా మంచినీటి పైపు లైన్ పగిలిపోవడంతో భారీగా నీరు వృధా అవుతుండటంపై వేద న్యూస్ దినపత్రికలో గత నెల 31న ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పైప్ లైన్ పగిలిన ప్రాంతా ల్లో మున్సిపల్ సిబ్బందితో మర మ్మత్తులు చేపట్టి, ప్రజలకు మళ్లీ సక్రమంగా మంచినీటి సరఫరా అందించారు.




వేద న్యూస్
2026-01-30
https://epaper.vedhanews.in/

## వృథాగా పోతున్న తాగునీరు..

– పట్టించుకోని అధికారులు
– ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**వేద న్యూస్, మడికొండ:**

నిత్యం గుక్కెడు తాగునీటి కోసం గ్రేటర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ పూటకు ఆ పూట నీటిని తెచ్చుకుంటూ జీవనం గడపాల్సిన దుస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణంలో అధికారుల నిర్లక్ష్యంతో తాగునీరు వృథాగా పోతుండటంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మడికొండ ఖండాల దాబా సుచి హోటల్ ఎదురుగా ఉన్న పైప్‌లైన్ పగిలిపోవడంతో భారీగా నీరు లీక్ అవుతోంది. దీంతో లీటర్లకు లీటర్ల తాగునీరు వృథాగా పోతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చీమ కుట్టినట్లైనా స్పందన లేదని ఆరోపిస్తున్నారు. ఒకవైపు ప్రజలు తాగునీటి కొరతతో నిత్యం అల్లాడుతుంటే, మరో వైపు అధికారుల నిర్లక్ష్యంతో విలువైన మంచినీరు వృథాగా పోతుండటం దారుణమని స్థానికులు మండిపడుతున్నారు. ఈ పరిస్థితికి బాధ్యులైన అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పగిలిన పైప్‌లైన్‌ను వెంటనే మరమ్మతులు చేసి, తాగునీటి సరఫరాలో ఉన్న లోపాలను సరిచేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నీటి వృథాను అరికట్టి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

**– స్కూల్ బస్సుల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు**

**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి స్కూల్ బస్సుల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవర్లు విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ తప్పనిసరిగా యూనిఫాం ధరించి, స్కూల్ పిల్లలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ఇటీవలి కాలంలో కొందరు డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాల కు కారణమవుతున్నారని, ఇది పిల్లల ప్రాణాలకు ముప్పుగా మారుతుందని ట్రాఫిక్ సీఐ వెంకన్న హెచ్చరించారు. ప్రతి స్కూల్ బస్సు డ్రైవర్ నిబద్ధతతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# అంబులెన్స్‌ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలోని 108 అత్యవసర అంబులెన్స్‌ను బేసిక్ లైఫ్ సపోర్ట్ నుంచి పలు ఆధునిక పరికరాలతో అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ వాహనంగా తీర్చిదిద్దగా, మంగళవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అంబులెన్స్‌లో అమర్చిన ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్ విత్ డీఫిబ్రిలేటర్, మానిటర్ తదితర అత్యవసర పరికరాల పనితీరును పరిశీలించారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి వేగంగా చేరుకుని క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించి సమీప ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం అంబులెన్స్ రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నయీమ్ జహ, 108 ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, సిరిసిల్ల జిల్లా మేనేజర్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా దుర్గామాత మూడో వార్షికోత్సవం

**– కన్నుల పండుగగా అభిషేకం, కుంకుమ పూజలు**

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ దుర్గా మాత ఆలయంలో మూడవ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు రాచర్ల హనుమాన్ల శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజను కన్నుల పండుగలా నిర్వహించగా, ఆలయ ప్రాంగణం భక్తితో మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహించగా, పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



# అతిరుద్ర మహాయాగంలో ప్రభుత్వ విప్

**వేద న్యూస్, గంభీరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో నిర్వహిస్తున్న అతిరుద్ర మహాయాగం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతోంది. ఈ మహాయాగంలో భాగంగా కాశీ విశ్వనాథ మందిర్ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వామి వారి ఆశీస్సులతో లోక కల్యాణం జరగాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాజన్న ఆలయ విస్తీర్ణం, అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరితగతిన పూర్తవ్వాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

# కాట్నపెల్లి వాసి గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలం కాట్నపెల్లి గ్రామానికి చెందిన కళ్లెం రమేష్‌కు లూసియానా యూనివర్సిటీ (అమెరికా) 2026 సంవత్సరానికి గాను గౌరవ డాక్టరేట్ అవార్డుకు ఎంపికైనట్లు యూని వర్సిటీ అధికారులు ప్రకటించారు. సమాజంలో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని తెలి పారు. ఈ అవార్డును మార్చి 8న దేశ రాజ ధాని ఢిల్లీలో యూనివర్సిటీ అధికారుల చేతుల మీదుగా అందుకోనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రమేష్‌ను పలువు రు అభినందించారు.



# గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**– ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి**
**– సర్పంచ్ జుట్టు శేఖర్**

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పత్తికుంటపల్లి గ్రామ పంచాయితీ ఆవరణలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జుట్టు శేఖర్ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని, ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికాబద్ధంగా గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా రోడ్లు, తాగునీరు, విద్యుత్, ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వచ్చే రెండు సంవత్సరాల కాలానికి గ్రామంలో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతో కూడిన యాక్షన్ ప్లాన్‌ను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. గత గ్రామ సభ తీర్మానాలను గ్రామ సెక్రటరీ సాయి సుధ చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మనోహర్ రెడ్డి, వార్డు సభ్యులు జుట్టు రాజమని, పావని, భారతి, రవి, మల్లయ్య, పూజ, గ్రామస్తులు తిరుపతి రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అంగన్వాడీ టీచర్, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 11, 2026

# కార్యదక్షుడు బండి సంజయ్

- తనను గెలిపించిన కార్యకర్తల రుణం తీర్చుకునేందుకు సర్వశక్తులు ఒడ్డిన నేత
- 'నేటి కార్యకర్తే రేపటి లీడర్' అనే నినాదానికి చిరునామాగా..
- పురపాలక ఎన్నికల్లో అన్నీ తానై శ్రమించిన లీడర్
- తనను నమ్మిన వారిని నిలబెట్టడమే లక్ష్యంగా..
- అనుచరులను ఆదుకునే అరుదైన నేతగా కేంద్రమంత్రికి పేరు



**వేద న్యూస్, కరీంనగర్ ప్రతినిధి:**

కార్యకర్త జీవితాంతం కార్యకర్తగానే ఉండాలా? అనే ప్రశ్నకు... 'నేటి కార్యకర్తే రేపటి లీడర్' అనే నినాదానికి చిరునామాగా మారారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. తెలంగాణ రాజకీయాలపై తనదైన ముద్ర వేస్తూ సమకాలీన రాజకీయ నేతలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. రాజకీయాలంటే కార్యకర్తలను అవసరానికి వాడుకుని వదిలేయడమే ట్రెండ్ గా మారిన ఈరోజుల్లో బండి సంజయ్ అందుకు భిన్నంగా అడుగులు వేస్తూ కార్యకర్తలకు నిత్యం వెన్నంటి ఉంటున్నారు. తన గెలుపునకు కారణమైన కార్యకర్తలందరి రుణం తీర్చుకుంటున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని కరీంనగర్ కార్పొరేషన్, వేములవాడ, సిరిసిల్ల, హుస్నాబాద్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా లెక్క చేయకుండా నూటికి 80 శాతం మంది నిఖార్సైన, నిబద్ధత కలిగిన కార్యకర్తలకే కార్పొరేటర్, కౌన్సిలర్ టిక్కెట్లు ఇచ్చారు. ఎన్నికలంటే గెలుపే అన్ని పార్టీలకు ప్రతిపాదిక. అధికారం లేనప్పుడు జెండా పట్టుకుని పార్టీ ఇచ్చే అన్ని కార్యక్రమాల్లో పాల్గొనేది కార్యకర్తలే... తీరా ఎన్నికల టైమొచ్చేసరికి మాత్రం గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వడం అనే కారణంతో కార్యకర్తలను పక్కన పెట్టడం అన్ని రాజకీయ పార్టీల్లో తంతుగా మారింది. బండి సంజయ్ మాత్రం ఈ తంతును పూర్తిగా చెరిపేసే ప్రయత్నం చేశారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే గత పంచాయతీ ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వడమే కాకుండా ఆర్థిక వనరులను కూడా స్వయంగా సమకూర్చారు. అభ్యర్థుల గెలుపు బాధ్యతలను సైతం పూర్తిగా తన భుజాన వేసుకున్నారు. ఫలితంగా తన పార్లమెంట్ పరిధిలో 108 సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుని రికార్డు సృష్టించారు. ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో సైతం ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున లీడర్లు బీజేపీలో చేరేందుకు యత్నించినా వాళ్లకు టిక్కెట్లు ఇచ్చేందుకు మాత్రం బండి సంజయ్ ససేమిరా అన్నారు. పార్టీ కోసం కష్టపడి ఏళ్ల తరబడి పనిచేసిన కార్యకర్తలకే పెద్ద పీట వేశారు. నూటికి 80 శాతం మంది కట్టర్ కార్యకర్తలకే కార్పొరేటర్, కౌన్సిలర్ టిక్కెట్లను కేటాయించడమే కాకుండా వారిని గెలిపించే బాధ్యతలను పూర్తిగా తన భుజానా వేసుకుని ఎన్నికలను ఒంటి చేత్తో నడిపించారు. బీజేపీ పక్షాన పోటీ చేసిన అభ్యర్థుల్లో 90 శాతం మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. రాష్టంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, ఆయా అభ్యర్థులు సైతం ఎన్నడూ అధికారిక పదవుల్లో కూడా లేకపోవడంతో వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. కుటుంబ నిర్వహణే కష్టంగా ఉన్న అభ్యర్థుల కుటుంబాలు చాలా ఉన్నాయి. అలాంటి వారందరికీ ఎన్నికలకు అవసరమైన ఆర్థిక సాయాన్ని కూడా స్వయంగా బండి సంజయ్ అందించారు. కొంత మంది అభ్యర్థులకు నామినేషన్ పత్రాలకు అవసరమైన డిపాజిట్ సొమ్మును కూడా బండి సంజయ్ పంపించడం గమనార్హం. గెలుపు వాతావరణాన్ని సృష్టించేందుకు అభ్యర్థుల పక్షాన డివిజన్లలో పెద్ద ఎత్తున స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లు, సభలు నిర్వహించారు. అందుకయ్యే ఖర్చునంతా బండి సంజయ్ భరించారు. అట్లాగే అభ్యర్థుల పేరిట కరపత్రాలను స్వయంగా ప్రింట్ చేయించి పంపించారు. అట్లాగే కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు ఆయా మున్సిపాలిటీల అభివృద్ధికి తాను ఎంతగా కృషి చేశానో చెబుతూ... కేంద్రం నుండి తెచ్చిన నిధులతో జరిగిన అభివృద్ధి వివరాలతో బుక్ లెట్ ను రూపొందించి ఇంటింటికీ పంపిణీ చేయించి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు.

**గల్లీ గల్లీ తిరుగుతూ ..**

ఎన్నికల ప్రచార వ్యవధి తక్కువగా ఉండటంతో పొద్దున్నే 6 గంటలు మొదలు రాత్రి 10 గంటలదాకా కార్యకర్తల గెలుపు కోసం గల్లీ గల్లీలోనూ తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ప్రచార సమయం ముగిసిన తరువాత సైతం పోల్ మేనేజ్ మెంట్, మరుసటి రోజు పార్టీ కార్యక్రమాల నిర్వహణపై కసరత్తు చేశారు. అదే సమయంలో అభ్యర్థులు ప్రచారం ఎట్లా ఉంది? వారు ఎక్కడ వెనుకబడ్డారు? ప్రత్యర్థుల ఎత్తుగడలు ఏమిటి? అనే అంశాలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ బీజేపీ అభ్యర్థులను అలర్ట్ చేస్తూ వారు పోటీ చేసే డివిజన్లలో, మున్సిపల్ వార్డుల్లో బీజేపీ గెలుపు తథ్యం అనే వాతావరణం కల్పించడంలోనూ బండి సంజయ్ అలుపెరగకుండా పనిచేశారు. బండి సంజయ్ పడుతున్న తపన, చెమటోడుస్తున్న తీరును చూసి సొంత పార్టీ నేతలే కాదు, ప్రత్యర్థి పార్టీల నాయకులు సైతం నివ్వెర పోతున్నారు. కార్యకర్తలపట్ల ఇంతటి ప్రేమ, బాధ్యత కలిగిన లీడర్ ను మేము ఇంతకు ముందెన్నడూ చూడలేదు... ఇక భవిష్యత్తులోనూ చూస్తామనే నమ్మకం లేదు"అని ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలే ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. బండి సంజయ్ పడుతున్న కష్టాన్ని చూసి ప్రజలు సైతం 'శభాష్ సంజయ్"అంటూ అభినందిస్తున్నారు. ఇక బీజేపీ కార్యకర్తల సంగతి చెప్పనక్కర్లేదు...'సాహో సంజయన్న...నీవే మాకు అండా దండా...మీ వెంట మేమంతా"అంటూ కొనియాడటం విశేషం.

## డా. గుగ్గిళ్ల దివ్యమూర్తికి సన్మానం



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డా. గుగ్గిళ్ల దివ్యమూర్తిని బోదులబండ గ్రామ సర్పంచ్ కట్టెకోల నాగార్జున గౌడ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. డాక్టర్ దివ్యమూర్తి ప్రతిభను గుర్తించి ఈ సన్మానం నిర్వహించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ దివ్యమూర్తి మాట్లాడుతూ, ఇప్పటివరకు తనకు 118 వేదికలపై సన్మానాలు జరిగాయని, ఈ సత్కారం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త బూర సైదారావు గౌడ్, బూర స్వరూప గౌడ్, గ్రామ పెద్దలు కట్టెకోల చిన్ని కృష్ణయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అనంతు కాశయ్య, వార్డు మెంబర్ చింతలపాటి భాస్కర్, కట్టెకోల వెంకటాద్రి, చింతలపాటి నరేష్, గుండు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ పై దాడికి నిరసనగా ధర్నా

**వేద న్యూస్, రుద్రూర్:**

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, రుద్రూర్ గ్రామ మాజీ సర్పంచ్ ఇందూరి చంద్రశేఖర్ పై సోమవారం రాత్రి బాన్సువాడలో జరిగిన దాడి, అసభ్య పదజాలంతో దూషించిన ఘటనకు నిరసనగా మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడిపై దాడి చేయడం అత్యంత దారుణమని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరి చంద్రశేఖర్‌తో పాటు ఉన్న ముస్లిం సహోదరులపై దురుసు పదాలతో దూషించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పార్టీ అధిష్టానం వెంటనే స్పందించి కాసుల బాలరాజ్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ



సర్పంచ్ ఇందూరి సునీత చంద్రశేఖర్, ఉపసర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు సభ్యులు, వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిశోధనల ద్వారా సామాజిక మార్పు సాధ్యం

**వేద న్యూస్, హైదరాబాద్:**

సమాజ అభివృద్ధిలో పరిశోధన కీలక పాత్ర పోషిస్తుందని డా. ఎస్. కమ్రుద్దీన్, అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ మేనేజ్‌మెంట్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పేర్కొన్నారు. పరిశోధన ద్వారా యువత సామాజిక సమస్యలకు పరిష్కారాలు కనుగొని వికసిత్ భారత్–2047 లక్ష్యానికి తోడ్పడగలరని అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీలో పరిశోధన పద్ధతులపై నిర్వహించిన ఒకరోజు కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యశాలను ప్రభుత్వ సిటీ కాలేజీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా బి.ఏ. పబ్లిక్ పాలసీ & గవర్నెన్స్ విద్యార్థుల కోసం నిర్వహించగా, 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యశాలలో డా. కె. శ్రీపతి పరిశోధన విధానాలపై, డా. ఎం. ఏ. మాలిక్ విమర్శాత్మక ఆలోచన ప్రాధాన్యతపై వివరించగా, శశిధర్ పబ్లిక్ పాలసీ రంగంలోని ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డా.ఎస్.కె.కమృద్దీన్

## తుంబురి దయాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, కారేపల్లి:**



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మేనల్లుడు, పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబురి దయాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు కారేపల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతి రావు ఆధ్వర్యంలో స్థానిక సినిమా హాల్ సెంటర్ వద్ద వేడుకలు మిన్నంటాయి. ఈ సందర్భంగా ఇమ్మడి తిరుపతి రావు మాట్లాడుతూ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా దయాకర్ రెడ్డి ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తున్నారని ప్రశంసించారు. కారేపల్లి మండల ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించే నాయకుడిగా దయాకర్ రెడ్డి నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## బ్రహ్మోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



**వేద న్యూస్, దామరచర్ల:**

దామరచర్ల మండలం వాడపల్లిలో మంగళవారం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, మీనాక్షి అగస్తీశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఘనంగా ఆవిష్కరించారు. కృష్ణా, మూసి నదుల సంగమం వద్ద వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారల బ్రహ్మోత్సవాలు ఈ నెల 13 నుంచి 18 వరకు, శ్రీ మీనాక్షి అగస్తీశ్వర స్వామి వారల బ్రహ్మోత్సవాలు 14 నుంచి 18 వరకు భక్తిశ్రద్ధల మధ్య జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో జ్యోతి, శివాలయం చైర్మన్ సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దయాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

మంత్రి పొంగులేటి క్యాంప్ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. యూనియన్ ప్రెసిడెంట్ కిషన్ నాయకత్వంలో పలు అనాధాశ్రమాల్లో బియ్యం, దుప్పట్లు, పండ్లు, బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు నరేంద్ర, వెంపటి వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్లు పాషా, భద్రం, గిరి, సెక్రటరీ జానీ, ట్రెజరర్ సైదులు రామ్మూర్తి, జాయింట్ సెక్రటరీలు నరసింహారావు, హనుమంతు, ఈసీ మెంబర్లు దిలీప్, వడ్లకొండ శీను, శ్రీకాంత్, ఫయాజ్, వెంకటేష్, అలీమ్, అంజి, సభ్యులు నవీన్, అన్వర్, పాషా, రమేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్

- 30 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం




**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లి గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 7న తెల్లవారుజామున కొంకటి తిరుపతి ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వెండి పూజా వస్తువులు దొంగిలించగా, బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో నిందితులుగా కంచు శివ శంకర్, సామల్ల బాలకిషన్‌లను గుర్తించి 30 తులాల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. త్వరితగతిన కేసు ఛేధించిన ఎస్ఐ రమాకాంత్, సిబ్బందిని సీఐ అభినందించారు.

వేద న్యూస్
బుధవారం ఫిబ్రవరి 11, 2026

# రోశయ్య మృతి బాధాకరం

**– సహకార సంఘం మాజీ చైర్మన్ గడ్డం స్పృధర్ రెడ్డి**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండలం ఆమనగల్ గ్రామానికి చెందిన తక్కెలపల్లి రోశయ్య మృతి బాధాకరమని సల్కునూరు సహకార సంఘం మాజీ చైర్మన్ గడ్డం స్పృధర్ రెడ్డి అన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, ఎండల తీవ్రతను తట్టుకోలేక మంగళవారం రోశయ్య మృతి చెందినట్లు తెలిపారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న స్పృధర్ రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే ఆమనగల్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు రోశయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని భార్య ధనమ్మ, కుమారుడు అంబేద్కర్‌లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సల్కునూరు సహకార సంఘం మాజీ డైరెక్టర్ పల్లభిక్షం, వల్లంపట్ల వెంకన్న, సుధాకర్, మెరుగు నరసయ్య, మెరుగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

**– జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ సిటీ 27వ వార్డు, మిర్యాలగూడ రోడ్డులోని 22వ వార్డు, గొల్లగూడ 20వ వార్డులో గల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, గుంపులపై నిఘా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ



కార్యక్రమంలో డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐలు, ఎస్ఐలు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం బోనస్ డబ్బులను తక్షణమే చెల్లించాలి

**– ప్రభుత్వం కొనుగోలు చేసిన వరి ధాన్యంలో అక్రమాలను అరికట్టాలి**
**– ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్**



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన వరి సన్న ధాన్యం పెండింగ్ డబ్బులను తక్షణమే రైతులకు చెల్లించాలని ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు సమాఖ్య ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా సివిల్ సప్లై డిఎం కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా సన్నధాన్యానికి క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించి ఆచరణలో సరిగా ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న ధాన్యం బోనస్ డబ్బులను తక్షణమే చెల్లిస్తున్నట్లు మీడియా ద్వారా అనేక ప్రకటనలు ముఖ్యమంత్రితో సహా చేస్తున్నారు తప్ప ఆచరణలో చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత రెండు సీజన్లో వేలాది మంది రైతులకు కోట్లాది రూపాయలు ఇవ్వాల్సి ఉందన్నారు. కుంటి సాగులతో ధాన్యం బోనస్ డబ్బులను రైతుల ఖాతాలో జమ చేయకుండా తాత్సారం చేయడం అన్యాయమన్నారు. అలాగే ప్రభుత్వం ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తే మధ్య దళారులు రైస్ మిల్లర్లు సరిగా భద్రపరచకుండా తప్పుడు పద్ధతుల్లో అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని ఇప్పటికైనా కొనుగోలు చేసేదాన్ని సరిగా భద్రపరిచి ప్రభుత్వం నిర్ణయించే విధంగా సరైన రీతిలో ఉపయోగించాలని డిమాండ్ చేశారు. అవకతవకలకు పాల్పడే మిల్లర్లపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చెవ్వ కుమారస్వామి, మహమ్మద్ రఫీ, దేవకరాజు, ఆకారపు బాబు, ముగ్గల్ల రాజాలు, దొంతి జయపాల్ రెడ్డి, ఆకారపు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# హక్కులను కాలరాసేందుకే నూతన కార్మిక చట్టాలు

**– దాస్యం వినయ్ భాస్కర్**
**– కార్మిక వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ ఆగ్రహం**
**– జాతీయ సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు**
**– అన్ని సంఘాలు ఏకమై పోరాటానికి పిలుపు**

**వేద న్యూస్ హనుమకొండ :**

భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం బాలసముద్రంలో ఉద్యోగ, కార్మిక హక్కుల సాధనలో భాగంగా జాతీయ సార్వత్రిక సమ్మె సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాలు కార్మికుల హక్కులను కాలరాసేందుకే రూపొందించారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, కేంద్ర కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 11న వేయి స్తంభాల దేవాలయం నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఫిబ్రవరి 12న జరిగే జాతీయ సార్వత్రిక కార్మికుల సమ్మెలో అన్ని సంఘాలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాలుగు నూతన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేసి, 29 పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. నూతన కార్మిక చట్టాల వల్ల కార్మికులు కనీస హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన



హెచ్చరించారు. పనికి తగిన వేతనం, సెలవులు, నిరసన తెలిపే హక్కులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని చెప్పారు. మేనేజ్మెంట్లు హైర్ అండ్ ఫైర్ విధానంలో ఉద్యోగులను తొలగించే అవకాశాలు పెరుగుతున్నాయని, భవిష్యత్తులో ఈఎస్ఐ, పీఎఫ్ వంటి కనీస సౌకర్యాలు కూడా దూరమయ్యే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కును కూడా కార్మికులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం అన్ని సంఘాలు ఏకమై కేంద్ర ప్రభుత్వంపై పోరాడాలని వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. రైతు ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని కార్మికులందరూ ఉద్యమించాలన్నారు. జాతీయ సార్వత్రిక సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలు కార్మిక సంఘాల నాయకులు, అధ్యక్షులు, కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు కబ్జా స్థలాన్ని పరిశీలించిన టౌన్ ప్లానింగ్ అధికారులు

**వేద న్యూస్, మడికొండ:**



కాజీపేట మండలం 46వ డివిజన్ మడికొండ ఎస్సీ కాలనీలో రోడ్డు కబ్జా విషయమై వచ్చిన ఫిర్యాదుపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మూడు రోజుల్లో రోడ్డు ఆక్రమణ తొలగించాలని అధికారుల ఆదేశాలు జారీ చేశారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

# వాలెంటైన్ వీక్‌లో ఆన్‌లైన్ మోసాలపై తెలంగాణ పోలీసుల హెచ్చరిక

**వేద న్యూస్ హైదరాబాద్ :**




వాలెంటైన్ వీక్ సందర్భంగా ఆన్‌లైన్‌లో ప్రేమ పేరుతో జరుగుతున్న మోసాలపై తెలంగాణ పోలీస్ ప్రజలను అప్రమత్తం చేసింది. సోషల్ మీడియా వేదికగా పరిచయాలు పెంచుకుని లింకులు పంపడం, గిఫ్టులు పంపిస్తున్నామంటూ డబ్బులు వసూలు చేయడం, వాలెంటైన్‌స్పెషల్ ఆఫర్ల పేరుతో నకిలీ సందేశాలు పంపి మోసం చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పంపే అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని, అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. అలాగే నకిలీ గిఫ్ట్‌లు, వాలెంటైన్ స్పెషల్ ఆఫర్లు అంటూ వచ్చే సందేశాలను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో ఏర్పడే పరిచయాల విషయంలో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించాలని, అవసరమైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలంగాణ పోలీసులు ప్రజలను కోరారు. ప్రేమ పేరుతో మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని, అప్రమత్తతే భద్రత అని గుర్తు చేశారు.

# ఆరోగ్య సమస్యగా మారుతున్న నిద్రలేమి

**వేద న్యూస్ డెస్క్:**

ఆధునిక జీవితం మనిషి జీవన విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ ఒక నిరంతర పరుగుల్లా జీవితం సాగుతోంది. పని ఒత్తిళ్లు, లక్ష్యాల వెనక పరుగు, ఆర్థిక బాధ్యతలు, భవిష్యత్తుపై ఆందోళనలు కలిసి మనిషి విశ్రాంతిని మెల్లగా దూరం చేస్తున్నాయి. ఒకప్పుడు శరీరం అలసినప్పుడు సహజంగా కళ్ళు మూసుకుపోయేవి. నేడు అలసట ఉన్నా నిద్ర రాకుండా మేల్కొని గడిపే రాత్రులు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి నిద్రలేమిని వ్యక్తిగత అలవాటు సమస్యగా కాకుండా, సమాజమంతటినీ ప్రభావితం చేసే కొత్త ఆరోగ్య సమస్యగా మార్చుతోంది. నిద్రలేమి అనేది ఒక్క రాత్రి నిద్ర పట్టకపోవడం మాత్రమే కాదు. అది శరీరం, మనసు రెండింటిపైనా దీర్ఘకాలిక ప్రభావం చూపే సమస్య. సరైన నిద్ర లేకపోతే మనసు క్రమంగా అలసిపోతుంది. చిరాకు పెరుగుతుంది, చిన్న విషయాలకే కోపం వస్తుంది, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం తగ్గుతుంది. చదువులో, పనిలో ఏకాగ్రత లోపిస్తుంది. ఇవన్నీ మొదట చిన్న సమస్యలుగా కనిపించినా, కాలక్రమంలో మానసిక ఒత్తిడి, ఆందోళన వంటి పెద్ద సమస్యలకు దారి తీస్తున్నాయి.

శరీర ఆరోగ్యంపై నిద్రలేమి ప్రభావం మరింత ప్రమాదకరం. సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి జీవనశైలి వ్యాధులకు నిద్రలేమి ఒక కారణంగా మారుతోందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరం రోజంతా చేసిన శ్రమ నుంచి కోలుకునే సమయం నిద్రలోనే లభిస్తుంది. ఆ అవకాశాన్ని కోల్పోతే, శరీరం లోపలినుంచి కుంగిపోతుంది.నిద్రలేమికి పరిష్కారం మందుల్లో మాత్రమే ఉందని భావించడం తప్పు. అసలు పరిష్కారం జీవనశైలిలో మార్పు. పని, విశ్రాంతి మధ్య సమతుల్యత అవసరం. రాత్రి పడుకునే ముందు స్క్రీన్‌లకు దూరంగా ఉండే అలవాటు పెంచుకోవాలి. కుటుంబంతో మాట్లాడటం,

నేటి కాలంలో నిద్రలేమికి ప్రధాన కారణంగా మారింది స్క్రీన్‌లపై పెరుగుతున్న ఆధారపడటం. రాత్రి పడుకునే ముందు మొబైల్‌లో సందేశాలు చూడడం, వీడియోలు చూడడం, సామాజిక మాధ్యమాల్లో గడపడం సాధారణ అలవాటుగా మారిపోయింది. ఈ వెలుగు కళ్ళను మాత్రమే కాదు, మనసును కూడా చురుకుగా ఉంచుతుంది. ఫలితంగా సహజ నిద్ర చక్రం భంగం అవుతోంది. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ సమస్యకు గురవుతున్నారు. వినోదం పేరుతో మొదలైన ఈ అలవాటు, మెల్లగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.

ఉద్యోగ ఒత్తిళ్లు కూడా నిద్రలేమిని పెంచుతున్న ప్రధాన కారణాల్లో ఒకటి. పని పూర్తయిన తర్వాత కూడా మనసు పనినే మోసుకుపోతుంది. రేపటి లక్ష్యాలు, పనితీరు భయం, ఉద్యోగ భద్రతపై ఆందోళనలు రాత్రంతా వెంటాడుతూనే ఉంటాయి. ఇంటికి వచ్చినా మనసుకు విశ్రాంతి లభించకపోవడంతో, నిద్ర దూరమవుతోంది. దీని ప్రభావం కుటుంబ జీవితంపైనా పడుతోంది. మాటలు తగ్గుతాయి, అనుబంధాలు బలహీనపడతాయి. పిల్లలు, యువతలో నిద్రలేమి మరింత ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది. చదువు ఒత్తిడి, పరీక్షల భయం, భవిష్యత్తుపై అంచనాలు వారి నిద్రను దూరం చేస్తున్నాయి. సరైన నిద్ర లేకపోవడం వల్ల వారి శారీరక ఎదుగుదల, మానసిక స్థిరత్వం దెబ్బతింటోంది. చిన్న వయసులోనే అలసట, ఒత్తిడి అలవాటుగా మారడం భవిష్యత్తుకు ప్రమాదకరం.

నిద్రలేమికి పరిష్కారం మందుల్లో మాత్రమే ఉందని భావించడం తప్పు. అసలు పరిష్కారం జీవనశైలిలో మార్పు. పని, విశ్రాంతి మధ్య సమతుల్యత అవసరం. రాత్రి పడుకునే ముందు స్క్రీన్‌లకు దూరంగా ఉండే అలవాటు పెంచుకోవాలి. కుటుంబంతో మాట్లాడటం, ప్రశాంతమైన అలవాట్లు అలవరచుకోవాలి. నిద్రను విలాసంగా కాకుండా, ఆరోగ్యానికి అవసరమైన అంశంగా చ

నిద్రలేమికి పరిష్కారం మందుల్లో మాత్రమే లేదన్న విషయాన్ని సమాజం గుర్తించాల్సిన అవసరం ఉంది. జీవనశైలిలో మార్పు రావాలి. పనివిశ్రాంతి మధ్య సమతుల్యత అవసరం. పడుకునే సమయానికి ముందు స్క్రీన్ వినియోగాన్ని తగ్గించాలి. కుటుంబంతో మాట్లాడటం, మనసును ప్రశాంతంగా ఉంచే అలవాట్లు పెంచుకోవాలి. నిద్రను విలాసంగా కాకుండా, ఆరోగ్యానికి అవసరమైన అంశంగా చూడాలి.

నిద్ర అనేది సమయ వృథా కాదు. అది శరీరానికి పునరుత్తేజం. మనసుకు ప్రశాంతత. ఆరోగ్యానికి పునాది. నిద్రను నిర్లక్ష్యం చేసే సమాజం అనారోగ్యాన్ని ఆహ్వానించినట్లే. అందుకే నిద్రలేమిని కొత్త ఆరోగ్య సమస్యగా గుర్తించి, దానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. విశ్రాంతి పొందిన మనసే ఆరోగ్యకరమైన సమాజానికి బలమైన ఆధారం.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 11, 2026

## విశ్వక్ సేన్ అనుదీప్ 'ఫంకీ'కి సెన్సార్ క్లియర్

**వేద న్యూస్ డెస్క్:**




మాస్ కా దాస్ విశ్వక్ సేన్, 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'ఫంకీ' విడుదలకు సిద్ధమైంది. ఫిబ్రవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాల ను పూర్తి చేసుకుని సర్టిఫికేట్‌ను పొందింది. సినిమా రన్‌టైమ్‌ను 128 నిమిషాలుగా ఖరారు చేసినట్లు మేకర్స్ వెల్లడించారు. ఇండస్ట్రీ నేపథ్యం లో సాగే సెటైరికల్ కామెడీగా రూపొందిన ఈ చిత్రంలో విశ్వక్ సేన్ ఫిల్మ్ డైరెక్టర్ పాత్రలో కనిపించనుండగా, కయాదు లోహర్ కథానాయిక గా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన 'యమ యమ్మ' పాట, ఫన్నీ ట్రైలర్ ప్రేక్షకుల్లో మంచి స్పందనను దక్కించుకుని సినిమాపై అంచనాలను పెంచాయి. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ 4 సినిమాస్ సంయుక్తంగా నిర్మించాయి. వాలెంటైన్స్ వీకెండ్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న 'ఫంకీ' పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా అలరించనుందని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

## 'రౌడీ జనార్దన'తో కీర్తి సురేశ్ సందడి ఖుషీ అవుతున్న ఫ్యాన్స్

**వేద న్యూస్ డెస్క్:**



హీరోయిన్‌గా తక్కువ సమయంలోనే స్టార్‌డమ్ అందుకున్న కీర్తి సురేశ్ మరోసారి టాలీవుడ్‌లో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. 'దసరా' సినిమా తర్వాత తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు చేయని ఆమె, ప్రస్తుతం తమిళ సినిమాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో తెలుగులో ఆమె నుంచి కొత్త సినిమా ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ సరసన 'రౌడీ జనార్దన' సినిమాలో నటించేందుకు కీర్తి సురేశ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విజయ్ దేవరకొండ కీర్తి సురేశ్ జోడీ తొలిసారి తెరపై కనిపించనుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై ఒక్కసారిగా బజ్ పెరిగింది. తెరపై ఈ జోడీ కొత్త ఫ్రెష్ ఫీల్ ఇస్తుందని అభిమానులు భావిస్తున్నారు. 'దసరా' తర్వాత తెలుగులో సరైన హిట్ రాకపోవడంతో కీర్తి సురేశ్ ఎంపికలపై అభిమానుల్లో కొంత అసంతృప్తి కనిపించినప్పటికీ, ఈ సినిమా ఆమెకు మంచి కమ్బ్యాక్ అవుతుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రంలో నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాను డిసెంబర్‌లో విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. విజయ్ దేవరకొండకు, కీర్తి సురేశ్‌కు ఈ సినిమా మరో విజయాన్ని అందిస్తుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఓటీటీలో ఐశ్వర్య రాజేశ్ క్రైమ్ థ్రిల్లర్ 'ప్లాన్ బి'కి మళ్లీ క్రేజ్

**వేద న్యూస్ డెస్క్:**



తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు పొందిన హీరోయిన్ ఐశ్వర్య రాజేశ్ సినిమాలకు ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో ప్రత్యేక ఆదరణ కొనసాగుతోంది. ఆమె ఎంచుకునే కథలు, పాత్రల్లో సహజమైన నటన కారణంగా ఆమె సినిమాలను మళ్లీ మళ్లీ చూసే ప్రేక్షకులు ఉన్నారు. 'ఫర్హానా', 'డ్రైవర్ జమున', 'సొపన సుందరి', 'రన్ బేబీ రన్' వంటి చిత్రాల సరసన ఇప్పుడు 'ప్లాన్ బి' (థిట్టమ్ ఇరాండు) కూడా ఓటీటీలో మంచి స్పందన పొందుతోంది. 2021లో రూపొందిన ఈ చిత్రం క్రైమ్ థ్రిల్లర్ జోనర్‌లో సాగుతుంది. 'థిట్టమ్ ఇరాండు' అంటే 'రెండో వ్యూహం' అనే అర్థం ఉండగా, ఓటీటీలో 'ప్లాన్ బి' పేరుతో కూడా అందుబాటులో ఉంది. ఈ సినిమాలో ఐశ్వర్య రాజేశ్ పోలీస్ అధికారిగా కనిపిస్తూ కథను ముందుకు నడిపిస్తుంది.

## 'టాక్సిక్'కు లీగల్ షాక్ చెట్ల నరికివేత ఆరోపణలపై ఎఫ్ఐఆర్

**వేద న్యూస్ డెస్క్:**




కన్నడ స్టార్ హీరో యష్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. బెంగళూరులోని పీణ్యాజలహల్లి సమీప అటవీ ప్రాంతంలో సినిమా షూటింగ్ సమయంలో అనుమతి లేకుండా చెట్లు నరికివేశారనే ఆరోపణలు నిజమని కర్ణాటక అటవీ శాఖ తేల్చడంతో నిర్మాతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. షూటింగ్ యూనిట్‌తో పాటు భూమిని లీజుకు ఇచ్చిన వ్యక్తులపైనా కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. 'కేజీఎఫ్' సిరీస్ తరువాత యష్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో 'టాక్సిక్'పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. మలయాళ దర్శకురాలు గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో డార్క్, ఇంటెన్స్ టోన్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. కథనం, విజువల్స్ పరంగా కొత్త అనుభూతి అందించేందుకు అంతర్జాతీయ స్థాయి టెక్నిషియన్లతో పని చేస్తున్నట్లు చిత్రబృందం ఇప్పటికే వెల్లడించింది. టీజర్‌లో యష్ డిఫరెంట్ లుక్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈ చిత్రంలో కియారా అద్వానీ, నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్ వంటి నటీమణులు కీలక పాత్రల్లో కనిపించనుండగా, హుమా ఖురేషి, నటాలీ బర్న్ కూడా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్లు, క్యారెక్టర్ విజువల్స్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. అయితే తాజాగా అటవీ భూమిలో అనుమతుల పరిమితిని దాటి చెట్లు నరికివేయడం చట్టవిరుద్ధమని అటవీ శాఖ స్పష్టం చేసింది. అటవీ శాఖ మంత్రి ఆ ప్రాంతాన్ని సందర్శించి ఫొటోలు సోషల్ మీడియాలో పంచుకోవడంతో వివాదం మరింత ముదిరింది. అనంతరం అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు కావడం సినీ వర్గాల్లో సంచలనంగా మారింది. తాజా లీగల్ సమస్య సినిమా విడుదలపై ప్రభావం చూపుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారగా, అభిమానులు మాత్రం 'టాక్సిక్' విడుదల కోసం ఎదురు చూస్తున్నారు.

## టీ20 ప్రపంచకప్‌లో భారత్‌పాక్ మ్యాచ్‌పై హఫీజ్ కీలక వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య జరగబోయే మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మహమ్మద్ హఫీజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌లు ఎప్పుడూ క్రికెట్ అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తాయని, ఇలాంటి మ్యాచ్‌లు తప్పకుండా జరగాలని తాను కోరుకుంటానని తెలిపారు. ఈ నెల 15న కొలంబో వేదికగా ఇరుజట్లు తలపడనున్న నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తొలుత భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించిన పాకిస్థాన్ ఆ తర్వాత నిర్ణయం మార్చుకోవడంతో కొద్ది రోజులుగా కొనసాగిన అనిశ్చితికి తెరపడింది. ఈ నేపథ్యంలో స్పందించిన హఫీజ్, గతంలో ఆసియా కప్‌లో జరిగినట్లుగా కాకుండా ఇకపై భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌లు పూర్తిగా క్రీడాస్ఫూర్తితో జరగాలని ఆకాంక్షించారు. ఇరుజట్ల ఆటగాళ్లు కూడా ఈ దిశగా సహకరించాలని సూచించారు. భారత్‌పాకిస్థాన్ పోటీలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను ఆకట్టుకుంటాయని, ఈ మ్యాచ్‌లు క్రికెట్‌కు మరింత ప్రాచుర్యం తీసుకువస్తాయని హఫీజ్ పేర్కొన్నారు. రాజకీయ అంశాలను క్రికెట్‌కు దూరంగా ఉంచాలని, క్రీడను కేవలం క్రీడగానే చూడాలని ఆయన పిలుపునిచ్చారు. రెండు దేశాలు క్రికెట్ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపై ఇరుదేశాల మధ్య మ్యాచ్‌లు తరచుగా జరగాలని ఆశాభావం వ్యక్తం చేసిన హఫీజ్, రాజకీయ కారణాలతో క్రికెట్‌ను ఆపడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 15న జరిగే మ్యాచ్ క్రీడా స్ఫూర్తికి నిదర్శనంగా నిలవాలని కోరుకున్నారు. ఆసియా కప్ తరహాలో ఉద్రిక్తతలు కనిపించకూడదని, అలాంటి పరిస్థితులు ఉంటే మ్యాచ్‌ను చూడకపోవడమే మంచిదని వ్యాఖ్యానించారు. గత ఏడాది ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ మూడుసార్లు తలపడగా అన్ని మ్యాచ్‌ల్లో టీమిండియా విజయం సాధించింది. అయితే పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఓ మ్యాచ్ అనంతరం ఇరుజట్ల ఆటగాళ్లు కరచాలనం చేయకపోవడం, ఫైనల్ విజయం తర్వాత టీమిండియా పీసీబీ చీఫ్ మోహన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ స్వీకరించకపోవడం వంటి ఘటనలు వివాదానికి దారితీశాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే హఫీజ్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.




## యూఏఈపై న్యూజిలాండ్ ఘన విజయం



**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ జట్టు వరుస విజయాలతో జోరు కొనసాగిస్తోంది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో కివీస్ ఓపెనర్లు టిమ్ సీఫర్ట్, ఫిన్ అలెన్ అద్భుత బ్యాటింగ్‌తో చెలరేగి జట్టుకు పది వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని అందించారు. 174 పరుగుల లక్ష్యాన్ని ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించడం మ్యాచ్ హైలైట్‌గా నిలిచింది. భారత్‌తో జరిగిన సన్నాహక సిరీస్‌లో ఎదురైన పరాజయం తర్వాత మెగా టోర్నీలో న్యూజిలాండ్ పూర్తిగా భిన్నమైన ఆటతీరు ప్రదర్శిస్తోంది. తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్‌పై విజయం సాధించిన కివీస్, ఇప్పుడు యూఏఈపై ఏకపక్షంగా ఆధిపత్యం చెలాయించింది. టిమ్ సీఫర్ట్ (89 నాటౌట్), ఫిన్ అలెన్ (84 నాటౌట్) మొదటి నుంచే దూకుడుగా ఆడుతూ యూఏఈ బౌలర్లను తీవ్ర ఒత్తిడికి గురిచేశారు. పవర్‌ప్లేలోనే వేగంగా పరుగులు రాబట్టిన ఈ జోడీ బౌండరీల వర్షం కురిపించింది. రోహిద్ ఖాన్ వేసిన ఓవర్లో సీఫర్ట్ వరుస బౌండరీలు బాదడంతో మ్యాచ్ పూర్తిగా కివీస్ వైపు తిరిగింది. అర్ధశతకాలు పూర్తి చేసిన తర్వాత కూడా ఇద్దరూ వేగం తగ్గించకుండా ఆడడంతో లక్ష్యం త్వరగా కరిగిపోయింది. చివరకు మరో 26 బంతులు మిగిలి ఉండగానే సీఫర్ట్ సిక్సర్‌తో విజయం ఖాయం చేశాడు.ఇంతకుముందు బ్యాటింగ్ చేసిన యూఏఈ జట్టు మాత్రం పోరాడే స్కోర్ నమోదు చేసింది. ఓపెనర్ ముహమ్మద్ వసీం (64 నాటౌట్) అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, అలీషన్ షరాఫు (55) హాఫ్ సెంచరీతో రాణించాడు. వీరి భాగస్వామ్యంతో యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. చివరి ఓవర్లలో మ్యాట్ హెన్రీ కీలక వికెట్లు తీసి పరుగుల వేగాన్ని తగ్గించాడు. ఈ విజయంతో మిచెల్ శాంట్నర్ నాయకత్వంలోని న్యూజిలాండ్ జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి గ్రూప్ డీలో అగ్రస్థానానికి చేరుకుంది. ఓపెనర్ల ఫామ్ కొనసాగితే కివీస్ ఈ టోర్నీలో బలమైన పోటీదారుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.సునాయాస విజయాన్ని అందించారు. 174 పరుగుల లక్ష్యాన్ని ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించడం మ్యాచ్ హైలైట్‌గా నిలిచింది. భారత్‌తో జరిగిన సన్నాహక సిరీస్‌లో ఎదురైన పరాజయం తర్వాత మెగా టోర్నీలో న్యూజిలాండ్ పూర్తిగా భిన్నమైన ఆటతీరు ప్రదర్శిస్తోంది. తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్‌పై విజయం సాధించిన కివీస్, ఇప్పుడు యూఏఈపై ఏకపక్షంగా ఆధిపత్యం చెలాయించింది. టిమ్ సీఫర్ట్ (89 నాటౌట్), ఫిన్ అలెన్ (84 నాటౌట్) మొదటి నుంచే దూకుడుగా ఆడుతూ యూఏఈ బౌలర్లను తీవ్ర ఒత్తిడికి గురిచేశారు. పవర్‌ప్లేలోనే వేగంగా పరుగులు రాబట్టిన ఈ జోడీ బౌండరీల వర్షం కురిపించింది.

## ఆటగాళ్లకు బీసీసీఐ కీలక ఆదేశాలు.. కుటుంబాలకు 'నో'



**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ సందర్భంగా భారత క్రికెటర్లకు బీసీసీఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. టోర్నమెంట్ సమయంలో ఆటగాళ్లతో పాటు వారి కుటుంబ సభ్యులు జట్టు హోటళ్లలో బస చేయడానికి అనుమతి ఉండదని బోర్డు స్పష్టం చేసింది. ఆటగాళ్ల ఏకాగ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. కుటుంబ సభ్యుల అనుమతిపై టీమ్ మేనేజ్‌మెంట్ స్పష్టత కోరినప్పటికీ, బోర్డు తన నిబంధనల ప్రకారమే ముందుకు సాగాలని నిర్ణయించింది. అయితే కుటుంబ సభ్యులు రావాలనుకుంటే, జట్టు ఏర్పాట్లకు భిన్నంగా స్వతంత్రంగా బస చేసుకోవచ్చని సమాచారం. బీసీసీఐ నియమావళి ప్రకారం 45 రోజులకు మించిన పర్యటనల్లో గరిష్టంగా 14 రోజులు, అంతకంటే తక్కువ వ్యవధి ఉన్న టూర్‌లలో 7 రోజులు మాత్రమే కుటుంబ సభ్యులకు అనుమతి ఉంటుంది. గతంలో జట్టు పేలవ ప్రదర్శనల నేపథ్యంలో ఈ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని బోర్డు నిర్ణయించినట్లు తెలుస్తోంది. 2024లో న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 0–3 తేడాతో ఓటమి, అలాగే 2024–25లో ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో 1–3 తేడాతో పరాజయం అనంతరం ఆటగాళ్ల దృష్టి పూర్తిగా ఆటపైనే ఉండేలా చర్యలు చేపట్టినట్లు సమాచారం. పర్యటనల సమయంలో ఆటగాళ్లు తప్పనిసరిగా జట్టుతోనే ప్రయాణించాలనే నిబంధనను కూడా బీసీసీఐ అమలు చేస్తోంది. ప్రస్తుతం టీ20 ప్రపంచకప్‌లో భారత్ అమెరికాపై విజయంతో శుభారంభం చేసింది. తదుపరి మ్యాచ్ ఢిల్లీలో నమీబియాతో జరగనుండగా, ఈ నెల 15న కొలంబో వేదికగా పాకిస్థాన్‌తో కీలక పోరుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ నిర్ణయం జట్టు ప్రదర్శనపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఆసక్తిగా మారింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073